వంటకాలను పరిశీలిస్తున్న హెచ్ఎం, గ్రామస్తులు

ఆకట్టుకున్న ఫుడ్ ఫెస్టివల్

బోథ్, ఫిబ్రవరి 29 : పొచ్చర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్ ఆకట్టుకున్నది. విద్యార్థులు వివిధ రకాల వంటకాలను ఇంటి వద్ద తయారు చేసి పాఠశాలకు తీసుకొచ్చి ప్రదర్శనకు ఉంచారు. వీటిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకన్నతోపాటు ఉపాధ్యాయులు పరిశీలించి రుచి చూశారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల నోడల్ అధికారి పోశెట్టి, మాజీ సర్పంచ్ మల్లేశ్, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గౌతమి పాల్గొన్నారు.

కలెక్టర్‌కు సన్మానం

ఎదులాపురం, ఫిబ్రవరి 29 : ఆదిలాబాద్ కలెక్టర్‌గా రాహుల్‌రాజ్ పనిచేసి మెదక్ జిల్లా కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఈ మేరకు గురువారం జడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి, ఎంపీపీ కల్యాణం లక్ష్మీరాజేశ్వర్‌లు పుష్పగుచ్చం అందజేసి శాలువాతో సత్కరించారు. 13 నెలలు పనిచేసి జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించారన్నారు.

గ్రామాల అభివృద్ధి కోసమే సీసీ రోడ్ల నిర్మాణం

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 29 : మారుమూల గ్రామాల అభివృద్ధి కోసమే సీసీ రోడ్ల నిర్మాణాలు చేపడుతున్నామని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు ముకాడే ఉత్తమ్, వడగాం మాజీ సర్పంచ్ తులసీరాం అన్నారు. గురువారం మండలంలోని వడగాంలో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాలను అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎండీ జహీర్, ఎంపీటీసీ మధూకర్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఈజీఎస్ సిబ్బంది

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

భీంపూర్, ఫిబ్రవరి 29 : భీంపూర్ మండలంలోని కరంజి(టి)లో గురువారం సీసీ రోడ్డు పనులను ఈజీఎస్ సిబ్బంది ప్రారంభించారు. రూ.5 లక్షలతో నిర్మిస్తుండగా.. వర్షాకాలంలో ఇబ్బందులు తప్పనున్నాయి. నాయకులు నారాయణరావు దేశ్‌ముఖ్, అశోక్, ఈజీఎస్ సిబ్బంది విఠల్, ఉద్దవ్, రెడ్డి సురేశ్, నితిన్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్

నిబంధనల పేరిట చెలగాటం ఆడుతున్న ప్రభుత్వం

బోథ్, ఫిబ్రవరి 29 : ఇంటర్మీడియట్ పరీక్షల నేపథ్యంలో ప్రభుత్వం నిబంధనల పేరిట విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతుందని తెలంగాణ విద్యార్థి పరిషత్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర ఆర్గనైజేషన్ సెక్రటరీ కొట్టూరి ప్రవీణ్‌కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు మనోవేదనకు గురై ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. జైనథ్ మండలానికి చెందిన విద్యార్థి శివకుమార్‌ది ఆత్మహత్య కాదని, ముమ్మాటికి ప్రభుత్వ హత్య అన్నారు. పరీక్షల్లో ఒక్కోసారి ప్రశ్నా పత్రాలు ఆలస్యంగా వస్తాయని, దానికి ఎవరు బాధ్యులని ప్రశ్నించారు. విద్యార్థి కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వెంకటేశ్ సన్నీత్, జశ్వంత్ ఆదిత్య, గణేశ్, వినిల్ కృష్ణ, కార్తీక్, అశ్విత్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డీడబ్ల్యూవో సబితా

సంక్షేమ పథకాలతో పేదరికాన్ని నిర్మూలించవచ్చు..

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 29 : సంక్షేమ పథకాల ద్వారా పేదరికాన్ని నిర్మూలించవచ్చని డీడబ్ల్యూవో సబితా అన్నారు. గురువారం మహిళా, శిశు సంక్షేమ శాఖ, మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బంగారిగూడ నుంచి ఆరుగురు ఆడ పిల్లలకు సుకన్య సమృద్ధి యోజన పథకం దస్నాపూర్ పోస్ట్ ఆఫీస్‌లో అకౌంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్థిక అక్షరాస్యత నిపుణులు నిఖిల్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర సంక్షేమ పథకాల ద్వారా పేదరికం, ఆర్థికలేమిని తొలగించవచ్చన్నారు. ఆడ పిల్లల చదువు, వివాహం, సుకన్య సమృద్ధి పథకం ఉపయోగాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జెండర్ స్పెషలిస్ట్ కృష్ణవేణి కోటేశ్వర్, మహిళలు పాల్గొన్నారు.

పూజలు నిర్వహిస్తున్న జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్

విగ్రహ ప్రతిష్ఠాపనకు హాజరైన మహిళా భక్తులు

ఘనంగా హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన

హాజరైన జడ్పీ చైర్మన్, ప్రముఖ మహారాజ్‌లు

ఉట్నూర్ రూరల్, ఫిబ్రవరి 29 : ఉమ్రి గ్రామంలో గురువారం హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, ప్రముఖ మహారాజ్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్మన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు భక్తిమార్గంలో నడవాలని అన్నారు. ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని పేర్కొన్నారు. అనంతరం మహారాజ్‌లు భక్తులకు ప్రవచనాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్రి మాజీ సర్పంచ్ విఠల్, లింబాజీ మహారాజ్, రామ్‌సింగ్ మహారాజ్, దేవ్‌సింగ్ మహారాజ్, ప్రేమ్‌సింగ్ మహారాజ్, రాంచందర్, దేవీదాస్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి..

ఉట్నూర్ ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు

ఉట్నూర్ రూరల్, ఫిబ్రవరి 29 : ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు అన్నారు. గురువారం మండలంలోని శంభుగూడ గ్రామంలో ఉపాధి హామీ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ఎండాకాలంలో కూలీ పని దొరకని వారికి ప్రభుత్వం ఉపాధి హామీ పనులు ఉపయోగపడుతాయన్నారు. ఎండ తీవ్రత అధికంగా ఉన్నందున తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. అదేవిధంగా జాబు కార్డు ఉన్న ప్రతి ఒక్కరు ఉపాధి పనులు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి ప్రవీణ్, ఫీల్డ్ అసిస్టెంట్ మారు ఉన్నారు.

ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీపీ జైవంత్‌రావు

ప్రణాళికాబద్ధంగా చదవాలి..

ఇచ్చోడ, ఫిబ్రవరి 29 : పదో తరగతి విద్యార్థులు ప్రణాళికాద్ధంగా చదివి ఉత్తమ మార్కులు సాధించాలని సిరికొండ ఎంపీడీవో బాల గంగాధర్ అన్నారు. గురువారం సిరికొండ మండల కేంద్రంలోని ప్రాథమిక జడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పదో తరగతి వార్షిక పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులు ఫోన్, టీవీలు, విందులకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రణాళికతో చదివితేనే ఉత్తమ మార్కులు సాధించి వచ్చన్నారు. ఆయన వెంట కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సునీల్, ఉపాధ్యాయులు కాంతయ్య ఉన్నారు.

పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీడీవో గంగాధర్

కన్నాపూర్‌కు శుద్ధజలం ప్లాంటు

ఉట్నూర్ రూరల్, ఫిబ్రవరి 29 : కన్నాపూర్‌కు జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ శుద్ధజలం ప్లాంటు అందించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో పల్లె నిద్ర కార్యక్రమంలో భాగంగా అధికారులతో కలిసి గ్రామంలో పల్లె నిద్ర చేశారు. ఇందులో భాగంగా గ్రామంలో సమస్యలు తెలుసుకుని గ్రామస్తుల కోరిక మేరకు బోర్‌వెల్, వాటర్ ప్లాంటు అందించారు.

కన్నాపూర్‌లో ఏర్పాటు చేసిన శుద్ధజలం ప్లాంటు

చదువుతోనే విలువ

తాంసి(తలమడుగు), ఫిబ్రవరి 29 : చదువుతోనే సమాజంలో విలువ పెరిగి గుర్తింపు లభిస్తున్నదని కెరీర్ గార్డెన్స్, మోటివేషనల్ స్పీకర్ అల్లం సాయికృష్ణ, రమణ గౌడ్ అన్నారు. గురువారం తలమడుగు మండలంలోని ఖోడద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు పరీక్ష భయాన్ని వీడి ఉన్న సమయాన్ని ప్రణాళికతో చదివితే తప్పకుండా మంచి మార్కులతో ఉత్తీర్ణులవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కృష్ణకుమారి, ఉపాధ్యాయులు ఎ.లక్ష్మి, సుకుమార్, డి.సురేఖ, ఎస్.సురేఖ, సత్యనారాయణ, వాసుదేవ్, పీఈటీ మమత పాల్గొన్నారు.

మోటివేషనల్ స్పీకర్స్‌ను సన్మానిస్తున్న ఖోడద్ ఉపాధ్యాయ బృందం

సమావేశంలో మాట్లాడుతున్న టీఏజీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సచిన్

మోదీ స్పష్టమైన ప్రకటన ఇవ్వాలి..

టీఏజీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సచిన్

ఎదులాపురం, ఫిబ్రవరి 29 : ఉద్యోగాల విషయంలో గిరిజన యువతకు వంద శాతం రిజర్వేషన్ కల్పించే జీవో నంబర్ 3పై రాష్ట్రపతి ఆర్డినెన్స్ జారీ చేయాలని, దానిపై జిల్లాకు వస్తున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్పష్టమైన ప్రకటన ఇవ్వాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ డిమాండ్ చేశారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని సీపీఎం పార్టీ కార్యాలయంలో టీఏజీఎస్ జిల్లా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కరోనా కాలంలో దొంగదారిన జీవో నంబర్ 3ను రద్దు చేసి, ఏజెన్సీ గిరిజన యువతకు అన్యాయం చేసిందని ఆరోపించారు. ఈనెల 4న జిల్లాకు వస్తున్న మోదీ గిరిజన యువతకు దోహదపడే జీవో 3పై స్పష్టమైన ప్రకటన ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తొడసం భీంరావు, జిల్లా అధ్యక్షుడు ఉయిక విష్ణు, ఉపాధ్యక్షులు లంకా రాఘవులు, నాగోరావు, కిష్టన్న, సభ్యులు సునీల్, మహేశ్, నగేశ్ ఉన్నారు.

ఆధ్మాత్మిక ప్రవచనాలు బోధిస్తున్న నారాయణ మహారాజ్

ఆధ్యాత్మికతతోనే మార్పులు

- ఆలయాల్లో హనుమాన్ చాలీసా పఠనం చేయాలి..
- ఆధ్యాత్మిక కార్యక్రమంలో నారాయణ మహారాజ్

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 29 : ఆధ్యాత్మికతతోనే సమాజంలో మార్పులు చోటు చేసుకుంటాయని నారాయణ మహారాజ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయ ఆవరణలో ఆధ్యాత్మిక ప్రవచనాలు బోధించారు. ఈ సందర్భంగా నారాయణ మహారాజ్ మాట్లాడుతూ.. హనుమాన్ ఆలయాల్లో ప్రతి శనివారం సామూహిక చాలీసాను పఠనం చేయాలన్నారు. అన్ని గ్రామాలకు ఆధ్యాత్మిక కార్యక్రమాలు వ్యాప్తి చేందేలా భక్తులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంద్రవెల్లి గ్రామ పటేల్, పీఏసీఎస్ చైర్మన్ మారుతి పటేల్ డోంగ్రే, మారుతి మహారాజ్ పాల్గొన్నారు.

మున్సిపల్ అజెండా అంశాలను

ఉర్దూలో ప్రచురించాలి..

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 29 : మున్సిపల్ అజెండా అంశాలను ఉర్దూలోనూ ప్రచురించాలని తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ అధ్యక్షులు షాహిద్ అహ్మద్ తవక్కల్ అన్నారు. గురువారం యూనియన్ సభ్యులతో కలిసి మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ ఖమర్ అహ్మద్‌ను మర్యాద పూర్వకంగా కలిసి విన్నవించారు. అనంతరం నూతనంగా బాధ్యతలు చేపట్టిన కమిషనర్‌ను శాలువాతో సన్మానించారు. సభ్యులు మహబూబ్, అన్వర్, ఖిజార్ యాఫై, అమీమ్ షరీఫ్, షేక్ మోయిజ్, షేక్ అస్మత్ అలీ పాల్గొన్నారు.

గంజాయి రవాణా చేస్తున్న మహిళ అరెస్టు

గుడిహత్నూర్, ఫిబ్రవరి 29 : ఒడిశా రాష్ట్రంలోని మల్కన్‌గిరి నుంచి మహారాష్ట్రలోని వాషిం జిల్లాకు (దాదాపు 600 కిలోమీటర్లు) స్కూటిపై గంజాయి రవాణా చేస్తున్న మోహినీ సంతోశ్ ఠాక్రేను పోలీసులు అరెస్టు చేశారు. గురువారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ భీమేశ్ వివరాలు వెల్లడించారు. యాంటి నార్కొటిక్ బ్యూరో సమాచారం మేరకు గురువారం గుడిహత్నూర్ మండలంలోని మాన్కాపూర్ గ్రామం వద్ద 28 కిలోల గంజాయి సహా మహిళను పట్టుకున్నట్లు తెలిపారు. స్కూటిపై ప్రయాణించడం, పైగా మహిళ కావడంతో ఎవరికీ అనుమానం రాకుండా నాలుగేండ్లుగా గంజాయి స్మగ్లింగ్ చేస్తున్నదని తెలిపారు. గంజాయిని స్వాధీనం చేసుకుని, మహిళను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎస్సై సయ్యద్ ఇమ్రాన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో రైతు మృతి

చేనుకు రక్షణగా అమర్చిన కరెంటు తీగలు తగిలి మృత్యువాత

బజార్‌హత్నూర్, ఫిబ్రవరి 29 : భూతాయి(కె) గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ పెందూర్ లక్ష్మణ్(56) చేనులో అమర్చిన విద్యుత్ తీగలు తగలి మృతి చెందాడు. ఎస్సై నరేశ్ వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలంలోని భూతాయి(కె) గ్రామానికి చెందిన పెందూర్ లక్ష్మణ్ గురువారం ఉదయం పశువులను మేపడానికి చందునాయక్‌తండా గ్రామానికి వెళ్లాడు. పడ్వాల్ సుభాష్ మొక్కజొన్న చేనులో మేపుతున్నాడు. మొక్కజొన్న పంట రక్షణకు అమర్చిన విద్యుత్ తీగలు తగిలి అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. భార్య తర్పుబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోద్ చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

మార్కండేయ విగ్రహ ప్రతిష్ఠాపన

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 29 : ఆదిలాబాద్ రూరల్ మండలంలోని లాండసాంగ్వి గ్రామంలో నూతనంగా నిర్మించిన మార్కండేయ ఆలయంలో గురువారం పూజారులు శ్రీకాంత్‌శర్మ, అరుణ్‌శర్మ మార్కండేయ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో భాగంగా మూడు రోజులుగా వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా హోమగుండం కార్యక్రమం చేపట్టారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు కామణి విఠల్, తాలూకా పద్మశాలి సంఘం అధ్యక్షుడు బొమ్మకంటి రమేశ్, ఆలయ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మోర హనుమండ్లు, వెంకటస్వామి, ఆలయ కమిటీ చైర్మన్ జిట్ట రమేశ్, కోశాధికారి మోర దత్తు, ఉపాధ్యక్షుడు జిట్ట నర్సింగ్, సభ్యులు నర్సింగ్, అశోక్ సత్యనారాయణ, గంగారెడ్డి పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న గ్రామస్తులు

సాధారణ మరణానికి

రూ.5 లక్షలు ఇవ్వాలి..

ఎదులాపురం, ఫిబ్రవరి 29 : భవన నిర్మాణ కార్మికుల సాధారణ మరణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి గాజంగుల రాజు అన్నారు. సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం కార్మిక శాఖ కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టారు. అసిస్టెంట్ కార్మికశాఖ అధికారులకు రాజలింగు, వినోద్‌లకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కార్యదర్శి రాజు మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికులకు ప్రమాద బీమా కింద రూ.10 లక్షలు, పెండ్లి కానుకుగా రూ.లక్ష, ప్రసూతి కానుకగా రూ.50 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే 60 ఏండ్లు దాటిన కార్మికుడికి రూ.6 వేల పింఛన్ సౌకర్యం కల్పించాలన్నారు. కార్మికుకుల పిల్లలకు రూ.3 వేల స్కాలర్‌షిప్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందించిన వారిలో ఆకుల రాజు, కల్లెపల్లి గంగయ్య, మహేందర్, రమేశ్, మారుతి నాగోరావు, గిరీశ్‌లు ఉన్నారు.

కార్మికశాఖ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

నిమిషం నిబంధన తొలిగించాలి..

ఎదులాపురం, ఫిబ్రవరి 29 : నిమిషం నిబంధన పెట్టి ప్రభుత్వం విద్యార్థులతో చెలగాటం ఆడుతున్నారని విద్యార్థి యువజన సంఘాల జేఏసీ జిల్లా అధ్యక్షుడు మెస్రం భాస్కర్ అన్నారు. గురువారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు మనోవేదనకు గురై జైనథ్ మండలానికి చెందిన టేకం శివకుమార్ ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. ఇది ప్రభుత్వ హత్యగా భావిస్తున్నామని, విద్యార్థి కుటుంబానికి ప్రభుత్వమే బాధ్యత వహించి వారి కుటుంబ సభ్యుల నుంచి ఒక్కరికి ప్రభుత్వం ఉద్యోగం, పదెకరాల భూమి ఇవ్వాలన్నారు. నిమిషం ఆలస్యం నిబంధన తొలిగించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జేఏసీ నాయకులు సురేశ్, కృష్ణ, మురళి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న విద్యార్థి యువజన సంఘాల జేఏసీ జిల్లా అధ్యక్షుడు భాస్కర్

ఘనంగా శివపార్వతుల విగ్రహ ప్రతిష్ఠాపన

జైనథ్, ఫిబ్రవరి 29 : తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దులోని జైనథ్ మండలంలో గల కొరట– చెనాకను అనుకుని ఉన్న కొరట గ్రామ సమీపంలో నూతనంగా ఓంకారేశ్వర ఆలయాన్ని నిర్మించారు. ఇందులో గురువారం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య శివపార్వతులు, గణపతి, లింగం, సరస్వతీ ఇతర విగ్రహాలను ప్రతిష్ఠించారు. దీనిని మరో కాశీగా తీర్చిదిద్దాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కొరటలో నూతనంగా నిర్మించిన ఓంకారేశ్వర ఆలయం

ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ ఔదార్యం

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 29 : ఆదిలాబాద్ మండలంలోని బంగారుగూడ ఆదర్శ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న హర్షవర్ధన్ ఇటీవలే బోడుప్పల్ జీడిమెట్లలోని అనురాగ్ యూనివర్సిటీలో జరిగిన స్పెల్ విజర్డ్ పోటీలో తృతీయ బహుమతి సాధించాడు. గురువారం ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ కె.సుధారాణి హర్షవర్ధన్‌ను అభినందిస్తూ రూ.3 వేలు అందించి తన దాతృత్వాన్ని చాటుకున్నది.

శిక్షణ ప్రయోజనకరం

ఉట్నూర్, ఫిబ్రవరి 28 : శిక్షణ అనేది ప్రతి వ్యక్తికి చాలా ఉపయోగకరంగా ఉంటుందని ఐటీడీఏ జీసీడీవో చాయ అన్నారు. గురువారం స్థానిక కుమ్రం భీం ప్రాంగణంలో తెలంగాణ భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో లీడర్స్‌కు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. శిక్షణలో సూచించిన, నేర్పించిన విషయాలను పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు రత్నాకర్, క్యాంప్ లీడర్స్ ప్రమోదిని, రాంరెడ్డి, కార్యదర్శి స్వామి, గుండి మహేశ్, జాయింట్ సెక్రటరీ లక్ష్మి, ట్రైబల్ స్కౌట్స్ ఇన్‌చార్జి యాదవ్‌రావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జీసీడీవో చాయ